# సీమ వార్త
తెలుగు దినపత్రిక

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పేజీలు : 4 గురువారం 16 ఏప్రిల్ 2026


## చంద్రన్న స్టేట్ టీం లో... నిమ్మల ఫ్యామిలీ

నిమ్మల అంబరీష్ కు రాష్ట్ర కార్యదర్శిగా ఛాన్స్.

నాడు యువ గళం లో లోకేష్ వెంట అంబరీష్....ఫలితమే నేడు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు

విభజన అనంతర నాయకత్వం... నిమ్మల అంబరీష్ కేనా.

హర్షం వ్యక్తం చేస్తున్న క్షేత్రస్థాయి పార్టీ శ్రేణులు.

గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త



తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప కుమారుడు నిమ్మల అంబరీష్ కు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ లో కీలకమైన పదవికి రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేయడంపై క్షేత్రస్థాయి పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తం అవుతుంది. రాష్ట్ర సీనియర్ పార్టీ నాయకులు నిమ్మల కిష్టప్ప కుమారుడు నిమ్మల అంబరీష్ గత ఎన్నికల ముందు నారా లోకేష్ చేపట్టిన యువ గళం లో కీలక పాత్ర పోషిస్తూ పాదయాత్ర చేపట్టిన నాటి నుంచి ముగిసే వరకు అంబరీష్ లోకేష్ మెంట పాదయాత్ర చేసి వారి మనసులో ప్రత్యేకమైన స్థానాన్ని సాధించడంలో అంబరీష్ అప్పట్లో సక్సెస్ అయ్యాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నూతన కమిటీ ఎన్నికల్లో భాగంగా పార్టీ సీనియర్ నేత నిర్మల కిష్టప్ప కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూ నిమ్మల అంబరీష్ కు రాష్ట్ర కార్యదర్శిగా పదవి బాధ్యతలు ఇవ్వడం జరిగింది. పార్టీ కోసం పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందనేదానికి ఈ సంఘటననే నిదర్శమని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా నియోజకవర్గాల విభజన కాబోతున్న నేపథ్యంలో నిమ్మల కిష్టప్ప కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూ ఆయన పెద్ద కుమారుడు అంబరీష్ కు కీలకమైన పదవి ఇవ్వడంపై భవిష్యత్తు పగ్గాలు అంబరీష్ కు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.







### పేలిన పేలుడు పదార్థం...

# గాలిలో కలిసిన ప్రాణాలు..!!

...కదిరి కుమ్మరవాండ్లపల్లిలో భారీ పేలుడు

సంఘటనా స్థలిలో నలుగురు మృతి--- మరో 26 మందికి గాయాలు.

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన అధికారులు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కందికుంట, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

( కదిరి --- సీమవార్త ):

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణ శివారులో గల కుమ్మరవాండ్లపల్లి గ్రామంలో బుధవారం భారీ పేలుడు సంభవించింది. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు సంఘటనా స్థలికి చేరుకుని ఆవేదన చెందారు. రాళ్లు పేల్చేందుకు ఉపయోగించే పేలుడు పదార్థాలు అకస్మాత్తుగా పేలడంతో అగ్నిజ్వాలలు పైకెగిసిపడ్డాయి. నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డ వారికి - మిగతా3లో



## గ్యాస్ పేలుల్లోని....

## మృతుల కుటుంబాలను

# ఆదుకోవాలి

పేలుళ్ల వాస్తవ విషయాలు విచారణలో నిగ్గు తేల్చాలి.

ప్రభుత్వాన్ని కోరిన....జిల్లా బిజెపి అధ్యక్షులు జిఎం శేఖర్.



గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త.

కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో జరిగిన పేలుళ్లలో మృతులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి క్షత గాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని బీజేపీ శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. కుమ్మర వాండ్ల పల్లిలో జరిగిన గ్యాస్ సిలెండర్ల పేలుళ్లలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అలాగే గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందించాలి. జరిగిన ఈ ఘటన పై తక్షణమే దర్యాప్తు జరిపించాలని .జిల్లెటిన్ స్టిక్స్ కూడా ఉన్నాయి అని సోషియల్ మీడియాలో వార్తలు వస్తున్నాయని ఉంటే ఇటువంటి పేలుడు పదార్థాలు ఉంచటం చట్టరీత్యా నేరం కాబట్టి వీటిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. ఇందులో అసాంఘిక శక్తుల ప్రమేయం ఉంటే ఎంతటి వారినైనా సరే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### పేదవాని.... నోటి దగ్గర భోజనం

# లాగేసిన వ్యక్తి జగన్ రెడ్డి

...అన్నక్యాంటీన్ ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీతలి

...రాప్తాడులో అట్టహాసంగా అన్న క్యాంటీన్ ప్రారంభంలి

....ముఖ్య అతిథిగా ఎంపీ పార్థసారథి.. క్యాంటీన్ ప్రారంభంపై హర్షంలి

....తమిళనాడు సీఎంని చూసైనా జగన్ బుద్ధి తెచ్చుకోవాల్సిందన్న ఎంపీలి

....శుభకార్యాల రోజున అన్న క్యాంటీన్ కు సాయమందించాలన్న ఎమ్మెల్యే సునీత

.... పాల్గొన్న...హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి.







రాప్తాడు ఏప్రిల్ 15 సీమ వార్త.

పేదవాడికి మూడు పూటలా అన్నం పెడు తుంటే.. దాన్ని కూడా జగన్ రెడ్డి ఓర్వలేకపో యాడని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, హిందూపురం ఎంపీ పార్థసారథి విమర్శలు చేశారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే, - మిగతా3లో

# పోషకాలు ఉన్న ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వండి.

.....గోరంట్ల పట్టణం లో ఏడవ రోజు పోషన్ పక్వాడ కార్యక్రమాలు.

.... సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో...సమతుల ఆహారం పై అవగాహన

గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త.





సోమందేపల్లి సిడిపిఓ డాక్టర్ శాంత లక్ష్మి ఆదేశానుసారం గోరంట్ల పట్టణం లోనీ మార్కెట్ వీధి లోని సబ్ సెంటర్ లో ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో ఏడవ రోజు పోషన్ పక్వాడ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగరాణి మాట్లాడుతూ రోజువారి ఆహారంలో ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లు ,పాలు, ప్రోటీన్స్ అన్ని సమతుల్యంగా ఉండాలని ముఖ్యంగా గర్భవతులు ,బాలింతలు, చిన్నపిల్లలకు స్థానికంగా దొరికే ఆహార పదార్థాలతో సమతుల ఆహారం ఎలా తయారు చేసి ఇవ్వాలో అవగాహన కల్పించడం అయినది .అలాగే ఇంట్లో లభ్యమయ్యే వ్యర్థ పదార్థాలతో బొమ్మలు ఎలా తయారు చేసుకోవాలో తల్లిదండ్రులకు డెమో ద్వారా అవగాహన కల్పించడమైనది .అలాగే ఆ వీధిలోని కమ్యూనిటీని అందర్నీ భాగస్వామ్యం చేసి సమతులఆహారంపై అవగాహన కల్పించడం జరిగింది. గోరంట్ల పట్టణంలోని ప్రజలు అంగన్వాడి సెంటర్లకు బొమ్మలు, కథల పుస్తకాలు, ఇంకా ప్రీస్కూల్ విద్యకు సంబంధించిన మెటీరియల్ , అంగన్వాడి సెంటర్లకు మౌలిక సదుపాయాలు డొనేట్ చేయవలసిందిగా ఈ సందర్భంగా కోరడమైనది. చిన్నపిల్లల సేవ దైవ సేవతో సమానం అందువలన చిన్న పిల్లలకు అవసరమైన వస్తువులు అంగన్వాడి సెంటర్లకు డొనేట్ చేయవలసిందిగా కోరడమైనది . ఈ కార్యక్రమంలో గోరంట్ల7 అంగన్వాడీ కేంద్రం కు విద్యార్థి తండ్రి రాజశేఖర్ సీలింగ్ ఫ్యాన్ డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో MSK వనితా బాయి ,CHO చైతన్య IÈ ,ఏఎన్ఎం రీహానా అంగన్వాడీ టీచర్లు ప్రమీల, పద్మ, సువర్ణరేఖ తల్లిదండ్రులు ,ప్రజలు పాల్గొన్నారు.

# కస్తూరిబాలో... విజయకేతనం

# ఎగరవేసిన ఇంటర్ విద్యార్థులు.











.... విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్ ఓ శిరీష.

గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త.

మండలంలోని ఖాజాపురం గ్రామం వద్ద గల ప్రభుత్వ కస్తూరిబా గురుకుల పాఠశాలలో ని ఇంటర్ విద్యార్థులు మంచి ఫలితాలతో విజయకేతనం ఎగురవేశారని ఎస్ఓ శిరీష తెలిపారు. బుధవారం వెలువడిన ఇంటర్ రెండవ సంవత్సరంలో ఫస్ట్ ర్యాంకుగా నివేదిత 947 మార్కులు, లోకేశ్వరి 932 మార్కులు, చందన థర్డ్ ర్యాంకులో భాగంగా 926 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫస్ట్ ర్యాంకుగా జోష్నాబాయి 500 కు గాను 476 మార్కులు, రెండవ ర్యాంకుగా కీర్తన భాయ్ 466 మార్కులు, సుకన్య 466 మార్కులు, థర్డ్ ర్యాంకులో భాగంగా స్వాతి 451 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ శిరీష తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు శిరీష శుభాకాంక్షలు తెలియజేశారు.





# హగరికి నీటిని విడుదల

# చేయాలని జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి

**బళ్లారి, ఏప్రిల్ 15 సీమవార్త:** వేసవి పంటలకు తుంగభద్ర జలాశయం నుండి నీరు అందకపోవడంతో, తాగునీటి ట్యాంకులు, కాలువలు, బావులు, బోర్‌వెల్స్ మరియు హగరి (వేదవతి నది) ఎండిపోతున్నాయి. దీంతో ప్రజలకు, పశువులకు నీటి సమస్య ఏర్పడుతోంది.

తాగునీటి కోసం తుంగభద్ర జలాశయం కుడి ఒడ్డున ఉన్న దిగువ స్థాయి కాలువ (ఎల్ఎల్సి)లోకి నీటిని విడుదల చేశారు. గ్రామ పంచాయతీలు ఈ నీటిని తాగునీటి ట్యాంకులకు నింపుతున్నాయి. కానీ హగరి (వేదవతి నది)కి ఆనుకుని ఉన్న గ్రామాల్లోని రైతులకు ఈ నీరు అందుబాటులో లేదు. అందువల్ల, బళ్లారి గ్రామీణ ప్రాంతంలోని బరదనహళ్లి, మోకా, గోటూరు, బనపూర్, బెనకల్లు, కర్చేడు గ్రామాల్లో ఈ సమస్య తలెత్తుతోంది. హోనేనూర్, యరగుడి, బాసరకోడు, హద్దిగి, తాళూరు, ఊలూరు, ఉట్నూరు, మత్సుగూరు, కురిగనూరు, బడుగువ, మైలాపూర్, బల్కుండి, హల్లిగనూరు, చాణుక్యనూరు, రావి, కర్చిగనూరు, బాగేవాడి, కుడదరహాలు, శ్రీధరగడ్డ తదితర గ్రామాలకు నీరు అందడం లేదు.

అందువల్ల మోకా గ్రామ సమీపంలోని హగరి (వేదవతి నది)కి నీటిని విడుదల చేస్తే ఈ గ్రామాలకు నీరు అందుతుంది.

కావున తక్షణమే మోకా గ్రామ సమీపంలోని ఎల్ ఎల్ సి కెనాల్ నుంచి హగరి (వేదవతి నది)కి నీటిని విడుదల చేయాలని తక్షణమే జలవనరుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారికి లేఖ రాశారు. మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్. సోమలింగప్ప, తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దారూర్ పురుషోత్తంగౌడ్ జిల్లా కలెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ కు వినతిపత్రం అందించారు



## గోరంట్ల విద్యార్థి... ఇంటర్ లో "వీణ" మోగించింది.

.... సింగిల్ విండో అధ్యక్షుడు రవి మోహన్ కుమార్తె సాయి వీణ విద్యలో ఆణిముత్యం.

గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త.



గోరంట్ల మండలం శీనప్పల్లి గ్రామానికి చెందిన గౌనువారిపల్లి సింగల్ విండో అధ్యక్షులు వై రవి మోహన్ కుమార్తె సాయి వీణ ఇంటర్ ఫలితాలలో 974/1000 మార్కులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థి సాయి వీణ కు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు వడ్డెర కుల సంఘ నాయకులు అభినందనలు తెలియజేశారు.

## కమ్మల వాండ్ల పల్లి చెరువులో... జలదారకు శ్రీకారం.

.... మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, చెరువు సంఘం అధ్యక్షులు గాజుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభం.



గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త.



గౌనివారిపల్లి గ్రామ పంచాయతీ కమ్మలవాండ్ల పల్లి చెరువు లో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార నీటినిర్వహణ 100 రోజుల కార్యక్రమం లో భాగంగా చెరువు కాలువల పూడికతీత ద్వారా భూగర్భ జలాల పెంపు నీటి నిర్వహణ కార్యక్రమం ప్రారంభం అయింది .జలధార నీటినిర్వహణ కార్యక్రమం గుత్తా బాలకృష్ణ చౌదరి టీడీపీ మండల కన్వీనర్ ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమం లో లిరాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, ఇరిగేషన్ ఏ ఈ అనిల్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి,టీడీపీ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, గౌనివారిపల్లి సింగల్ విండో అధ్యక్షులు రవిమోహన్, గౌనివారిపల్లి చెరువు సంఘము అధ్యక్షులు వేణుగోపాల్, జనసేన బీజేపీ అధ్యక్షులు సంతోష్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ తిరుపాల్, ఏపీ ఎన్జీవో మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల విద్య ధరణి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్ రెడ్డి,నిమ్మల శ్రీధర్ నరసింహాలు, స్టోర్ డీలర్ నాగభూషణ, శ్రీనివాసులు,మేధార శ్రీనివాసులు, ప్రభాకర్ రాఘవేంద్ర,వృసభ, మల్లికార్జున,,రంగప్ప,లక్మినారాయణ,చంద్ భాష,శంకర్, గోవింద్,కుమార్, సాయి, ఈశ్వర్, బజంత్రి శంకర్, సోమశేఖర్, శ్రీశైలం శ్రీనివాసులు కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నరు

## ఇంటర్ లో ఎస్ ఎ పి ఎస్ కాలేజీలో... 6 మందికి టాప్ ర్యాంక్స్.

.... విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన... ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యనారాయణ, కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ.

గోరంట్ల ఏప్రిల్ 15 సీమ వార్త.










ఇంటర్ పరీక్ష ఫలితాలలో గోరంట్ల పట్టణంలోని ఎస్ ఎ పి ఎస్ జూనియర్ ఎయిడెడ్ కళాశాల కు చెందిన 6 మంది విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఇందులో భాగంగా ఇంటర్ ఫస్టియర్ కు చెందిన శివ స్మృతి ఎంపీసీ లో 93 శాతం లో భాగంగా 470 కి 437, బైపీసీలో మోక్షితా 91.5 % లో భాగంగా 455 కు 416 , అలాగే ఎంపీసీలో యువన్ కు 91.2% లో భాగంగా 470కి 429 మార్కులు వచ్చినట్లు తెలిపారు. అలాగే ఇంటర్ రెండవ సంవత్సరంలో ఎంపీసీలో శ్వేతాకు 97% లో భాగంగా 1000 కి 968 మార్కులు, బైపీసీలో నీలిమ కు 96.5% లో భాగంగా 1000 కి 964 మార్కులు, ఎంపీసీలో దిలీప్ కు 88.3% లో భాగంగా 1000 కి 883 మార్కులు సాధించినట్లు వారు తెలిపారు. ఏడాది ఇంటర్ ఫలితాలలో భాగంగా ఫస్ట్ ఇయర్లో 62 శాతం, సెకండ్ ఇయర్ లో 67% ఫలితాలు వచ్చినట్లు ప్రిన్సిపల్ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తో పాటు కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇంటర్ లో మండల టాపర్ గా ఆదర్శ పాఠశాల విద్యార్థిని













అమరాపురం ఏప్రిల్ 15 సీమవార్త

అమరాపురం ప్రభుత్వ ఆదర్శ కళాశాల విద్యార్థిని గంగోత్రి బైపిసి గ్రూపు నందు ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 98 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచినట్లు ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ కె. ప్రియాంక, వైస్ ప్రిన్సిపాల్ హనుమన్నలు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ,బైపీసీ,ఎంఇసి, సిఈసి మొదటి సంవత్సరం ఇంటర్ నందు 45 మంది విద్యార్థులకు గాను 41 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరమునందు అన్ని గ్రూపులకు గాను 87 మంది విద్యార్థులకు గాను 86 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా బైపిసి ఎస్. పూజిత 1000మార్కులకు 917 మార్కులు, రేఖ సీఈసీ గ్రూప్ నందు1000 మార్కులకు 907 సాధించినట్లు వారు తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్ నందు ఎంపీసీ మన్య470 మార్కులకు గాను 467, బైపిసి జాహ్నవి 455 మార్కులకు గాను445, సీసీ స్పందన 500 మార్కులకు గాను 328 మార్కులు సాధించినట్లు వారు పేర్కొన్నారు. మండల టాపరుగా ఆదర్శ పాఠశాల విద్యార్థిని మార్కులు సాధించడం పట్ల కళాశాల అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల అధ్యాపక బృందం అభినందించారు

## ఘనంగా వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్ జన్మదిన వేడుకలు

అమరాపురం ఏప్రిల్ 15 సీమవార్త



మండల కేంద్రమైన అమరాపురం నందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం వాగేష్ జన్మదిన వేడుకలు వాగేష్ తోటలో వాగేష్ అభిమానులు మరియు వైకాపా నాయకులు కార్యకర్తల అభిమానం మధ్య ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి వాగేష్ కుఅభిమానులు పూలమాలలతో శాలువలు కప్పి అభిమాన నాయకుడికి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం అభిమానుల మధ్యలో వైకాపా రాష్ట్ర నాయకులు రవిశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు అశ్వత్ నారాయణ తదితరుల సమక్షంలో బారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడిబండ జడ్పిటిసి భూతరాజ్, ఎంపీటీసీ ధనుంజయ, మాజీసర్పంచులు జోగేంద్ర, జితేంద్ర, యంజారప్ప, వైస్ సర్పంచ్ సిద్దేశ్వర, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు గొల్లమారనపల్లి చిత్తన్న, వీరపసముద్రం నరసింహమూర్తి,మను, యువ నాయకుడు పూల మార్కెట్ రంగనాథ్, గాలి దానేగౌడ్, నంజుండ, బీడీ మూర్తి,తలారి నాగభూషణ్, తలారి, చంద్రశేఖర్ ,తలారి మంజునాథ్ ,తలారి మహేష్, చిత్తన్న, గాదిరప్ప, నిద్రగట్ట నటరాజ్, ఇషాక్, అన్వర్, ఉదుగూరు రాజన్న, సిద్దేశ్వర ,శివ ,గంగాధరప్ప, నాగప్ప, కో ఆప్షన్ మెంబర్ రసూల్ బాషా, గౌడనకుంట రామలింగప్ప తదితర నాయకులు పాల్గొని ఘనంగా జన్మదిన వేడుకల సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఇంటర్ ఫలితాలలో విజయడంక మోగించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినీలు.. ప్రిన్సిపాల్ వనిత వాణి.

**ధర్మవరం రూరల్ ఏప్రిల్ 15 సీమవార్త ;** ఇంటర్ ఫలితాలలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినీలు విజయదుందుభి మోగించడం జరిగిందని ప్రిన్సిపాల్ వనిత వాణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరపు లో 141 మంది పరీక్షలు రాయగా 117 మంది ఉత్తీర్ణత సాధించి 83 శాతంనమోదు కావడం జరిగిందన్నారు. ఒకేషనరీ విభాగంలో 85 మంది కు గాను 71 మంది ఉత్తీర్ణులు కాగా 84 శాతం నమోదు కావడం జరిగిందన్నారు. టాపర్లుగా ఎస్. భవాని ఎంపీసీ 986 మార్కులు, పి గాయత్రి 985 మార్కులు ఎంపీసీ గ్రూప్, పి లలిత ఎంపీసీ గ్రూపులో 979 మార్కులు, ఎన్. మాధవి బైపీసీ గ్రూపులో 985 మార్కులు, బి హేమత పశ్వని బైపిసి లో 982 మార్కులు, ఎస్ అంజుం పరహాత్ సీఈసీ లో 934 మార్కులు, పి రుక్షార సీఈసీ లో 906 మార్కులు, పి వాణి హెచ్ఈసి లో 788 మార్కులు కైవసం చేసుకున్నారన్నారు. అదేవిధంగా ఒకేషనల్ లో ఎస్ సాఫియా రెండవ ఎంఎల్టి లో 959 మార్కులు, ఎం సుప్రియ రెండవ ఎం పి హెచ్ డబ్ల్యు 954 మార్కులు, ఎన్ అంజుమాన్ కౌషల్ రెండవ ఎంపిహెచ్డబ్ల్యులో 947 మార్కులు సంపాదించారని తెలిపారు. తదుపరి ప్రథమ సంవత్సరం ఫలితాలలో 114 మంది పరీక్షలు రాయిగా 82 మంది ఉత్తీర్ణత సాధించారని మొత్తము 72 శాతము నమోదు కావడం జరిగిందన్నారు. ఒకేషనల్ విభాగంలో 88 మంది హాజరుకాగా 58 మంది ఉత్తీర్ణులు అయ్యారని 66 శాతము నమోదు కావడం జరిగిందన్నారు. టాపర్లుగా కే ప్రీతీ ఎంపీసీ గ్రూపులో462 మార్కులు, వి అమృతవల్లి ఎంపీసీ గ్రూపులో 459, డి గీతిక ఎంపీసీ గ్రూపులో 450 రెండు మార్కులు, ఒకేషనల్ లో కె అంజలి ఫస్ట్ ఓఏలో 476 మార్కులు, జి సంజీవరాణి ఎంపీహెచ్డబ్ల్యూలో 475 మార్కులు, డి జయశ్రీ ఎమ్మెల్టి లో 474 మార్కులు సాధించడం జరిగిందని తెలిపారు. ప్రతిభ కనపరిచిన, కాపరుగా నిలిచిన విద్యార్థినీలకు ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు, కళాశాల కమిటీ అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.



# పేదవాని.... నోటి దగ్గర భోజనం లాగేసిన వ్యక్తి జగన్ రెడ్డి.

-మొదటిపేజీ తరువాయి

ఎంపీకి స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీగా తరలివచ్చిన ప్రజల మధ్య క్యాంటీన్ ను ప్రారంభించారు. ఎమ్మెల్యే సునీత, ఎంపీ పార్థసారథి క్యాంటీన్ లో భోజనం రుచి చూశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆ తర్వాత 10లక్షలతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్కును కూడా ప్రారంభించారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ ప్రారంభంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ మండల కేంద్రాలకు, నియోజకవర్గ కేంద్రాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి కోసం గత టీడీపీ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తే.. ఆ తర్వాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి కక్ష పూరితంగా మూసివేయించాడన్నారు. తమిళనాడులో కూడా అన్న క్యాంటీన్ల తరహాలోనే అమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశారన్నారు. ఆ తర్వాత వచ్చిన స్టాలిన్ వాటిని పేర్లు కూడా మార్చకుండా కొనసాగించారన్నారు. జగన్మోహన్ రెడ్డికి అన్న క్యాంటీన్ అనే పేరు ఇష్టం లేకపోతే తన తండ్రి పేరు పెట్టుకున్నా తాము ఆక్షేపించే వారం కాదన్నారు. కానీ ఆయన ఏకంగా క్యాంటీన్లను ఎత్తివేయించడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. అందుకే కూటమి వచ్చిన తొలి నెలలోనే 200క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. ఇప్పుడు మరో 65క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. ఇప్పుడు ఈ క్యాంటీన్లు వేలాదీ మంది కూలీలు, రైతులు, పేద వారికి ఉపయోగపడుతున్నాయన్నారు. జగన్మోహన్ రెడ్డికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉన్న తేడా ఏంటనేది ఒక్క విషయం ద్వారానే తెలుసుకోవచ్చున్నారు. మరోవైపు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో తాను పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్నప్పుడు అన్న క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. తమిళనాడుకు వెళ్లి అక్కడ అమ్మ క్యాంటీన్లను పరిశీలించి.. అదే తరహాలోనే ఎక్కువ మందికి భోజనం అందించేలా వీటిని ప్రారంభించామన్నారు. అయితే ఆ



తర్వాత వచ్చిన జగన్ రెడ్డి ఇవి కొనసాగితే ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి పేరు వస్తుందన్న ఉద్దేశ్యంతో వాటిని మూసివేయించారన్నారు. దీని వలన ఎంతో మంది పేదలు ఆకలితో ఉండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చాక.. అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించారన్నారు. తాజాగా అందుబాటులోకి వచ్చిన వాటితో కలిపి మొత్తం 265క్యాంటీన్లలో పేదలకు మూడు పూటలా కేవలం 5రూపాయలకు భోజనం అందుతోందన్నారు. రాప్తాడులో ఎప్పటి నుంచో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉందన్నారు. పనులు ప్రారంభించిన 6నెలల్లోగానే 61లక్షలతో క్యాంటీన్ నిర్మాణం చేసినట్లు చెప్పారు. దీని వలన రాప్తాడు మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు, ఆసుపత్రికి వచ్చే వారికి ఆటో నగర్ లో ఉన్న కార్మికులకు, కూలీ పనులకు వచ్చే వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉదయం అల్పహారం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనం అందుబాటులో ఉంటుందన్నారు. ఇది అత్యంత నాణ్యతగా ఉండేలా హరే కృష్ణ మిషన్, అక్షయపాత్ర వారికి అప్పగించినట్టు చెప్పారు. అయితే చాలా మంది పుట్టినరోజు, పెళ్లిరోజులంటూ వృథాగా డబ్బు ఖర్చు చేస్తుంటారు.. అలాంటి వారు అన్నక్యాంటీన్ల వద్ద తమ పేరుతో ఉచితంగా భోజనం అందించవచ్చన్నారు. ఇక్కడ ముందే సంప్రదించి.. డబ్బు చెల్లిస్తే వారే అన్నదాన కార్యక్రమం చేస్తారన్నారు. ఈ క్యాంటీన్ లో భోజనం తినే వారి సంఖ్యను బట్టి మరింత మందికి అందించేలా చూస్తామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు...

# రేవంత్‌కు కేటీఆర్ మద్దతు

**హైదరాబాద్ :** రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తామన్న కేటీఆర్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతంగా ఉందని, డీలిమిటేషన్ తర్వాత ఇది అలాగే ఉండాలని అన్నారు.బీజేపీ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచుతామని కిషన్ రెడ్డి చెబుతున్నారని, కానీ డీలిమిటేషన్ బిల్లులో ఆ అంశమే లేదని అన్నారు. కిషన్ రెడ్డి చెప్పిన ప్రకారం అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, 17 లోక్ సభ స్థానాలకు 26 పెరుగుతాయని చెప్పారని తెలిపారు. కానీ బిల్లులో ఈ పెరుగుదల లేదని అన్నారు.బీజేపీ ఎప్పుడూ తెలంగాణకు మిత్రుడు కాదని విమర్శించారు. 2014 ఏపీ పునర్విభజన బిల్లులోనే సీట్ల పెంపు హామీ ఉందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ అనుకూలమేనని, కానీ డీలిమిటేషన్ బిల్లులో మా త్రం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

పోరాటం తప్పదన్న కేసీఆర్ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల





పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు.చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా బిల్లు ఉంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం సీట్లు ఉన్నాయని గుర్తు చేశారు. పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ తెలిపారు. అంతవరకు మనం తొందరపడకూడదని పార్టీ నాయకులకు సూచించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## బళ్లారిలో ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు-- 65కు పైగా చిరు వ్యాపారుల షెడ్ల తొలగింపు

**బళ్లారి, ఏప్రిల్ 15 సీమవార్త:**



నగరంలో పాదచారుల భద్రత, సులభమైన ట్రాఫిక్ కోసం బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్ ఫుట్‌పాత్ శుభ్రపరిచే ఆపరేషన్‌ను ప్రారంభించింది. గడిగి చన్నప్ప సర్కిల్ నుండి ఏపీఎంసీ వరకు, సంగం సర్కిల్ నుండి తారానాథ్ ఆసుపత్రి వరకు, దుర్గమ్మ గుడి నుండి తాలూరు రోడ్డు వరకు నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా కార్యాన్ని చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 65కు పైగా అక్రమ ఆక్రమణలను గుర్తించారు. దుకాణాల ముందు నిర్మించిన తాత్కాలిక షెడ్లు, అక్రమంగా నిల్వ చేసిన సామాగ్రిని తొలగిస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మున్నాఫ్ పటేల్ తెలియజేస్తూ, “నగరంలోని అన్ని పాదచారుల మార్గాలను క్లియర్ చేసే లక్ష్యంతో ఈ ఆపరేషన్ చేపట్టాము” అని అన్నారు. ఫుట్‌పాత్‌ను అక్రమంగా ఆక్రమించుకున్న వారు స్వచ్ఛందంగా ఖాళీ చేయకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. పాదచారులకు సురక్షితమైన ట్రాఫిక్ వ్యవస్థను అందించేందుకు ఈ ఆపరేషన్ రాబోయే రోజుల్లో కూడా కొనసాగుతుందని కార్పొరేషన్ తెలిపింది. ఈ చర్యకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

## మంగళగిరి...జనవాణి లో “పత్తి “

..... మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించిన ఐడిసి డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్

**అనంతపురం, ఆగస్టు 15 సీమ వార్త:** జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమానికి విశేష జన స్పందన వస్తోందని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పత్తి చంద్రశేఖర్ కృష్ణాజిల్లా డీసీఎంఎస్ అధ్యక్షుడు రామకృష్ణ, కృష్ణ పెన్నా మహిళ రీజినల్ కోఆర్డినేటర్ రావి సౌజన్య, లీగల్ సెల్ రాజశేఖర్ తో కలిసి రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన ప్రజల విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవను పలువురు అభినందిస్తున్నారని పత్తి చంద్రశేఖర్ తెలిపారు.

## పేలిన పేలుడు పదార్థం... గాలిలో కలిసిన ప్రాణాలు..!!

-మొదటిపేజీ తరువాయి

మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సంఘటనలో మొత్తం మరో 26 మంది తీవ్ర గాయాలపాలయినట్లు సమాచారం. క్షతగాత్రులను తొలుత కదిరి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమచికిత్స అందచేసి, అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం నగరానికి తరలించారు.

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని కంకర మిషన్లకు అవసరమైన రాయిని క్వారీల్లో పేల్చి సరఫరా చేసేందుకు ఇక్కడ ముడిసరుకు దాచించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు కార్మికులు అక్కడ అద్దె ఇంటిలో చాలా కాలంగా నివాసం ఉంటున్నారు. వారు యధావిధిగా బుధవారం ఉదయం క్వారీకి బయలుదేరారు. వాళ్ళ సాధారణ విధుల్లో భాగంగా పేలుడు సామాగ్రిని ఇంట్లోనే సిద్ధం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పొగలు ఎగసిపడ్డాయి. పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని గ్రహించిన కొందరు కార్మికులు అక్కడి నుంచి పరారైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.కాగా వారు ఆశ్రయం పొందిన

ఇంట్లో నిల్వ ఉంచిన జెలటిన్ స్టిక్స్, ఇతర పేలుడు పదార్థాలు, గ్యాస్ కలిసి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ పేలుడు తీవ్రతకు సమీపంలోని మూడు నివాస గృహాలు సైతం శిథిలంగా మారాయి. సంఘటనతో పెద్ద ఎత్తున పేలుడు శబ్దాలు రావడంతో పాటు భారీగా మంటలు చెలరేగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. శబ్దాలు విని, ఎగిసిపడుతున్న మంటలను గమనించిన పరిసర ప్రాంతాల ప్రజలు వాటిని అదుపు చేసేందుకు పరుగులు తీశారు. అయితే అప్పటికే మంటల తీవ్రత, పేలుడు ప్రభావంతో వారిలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

మృతులను విశ్వనాథరెడ్డి (50), మధుసూదన్ (40), అస్లాం భాషా (50), మాబున్నీసా (50)గా గుర్తించారు. వీరంతా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించే క్రమంలో మంటలు, శ్వాస తీసుకోవడానికి, ఇబ్బందికి.గురై ఊపిరాడకపోవడం వల్ల అక్కడికక్కడే నిమిషాల్లో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అశోక్ అనే మరో వ్యక్తి పరిస్థితి ఆందోళనకరంగా ఉండి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరు కాకుండా మరో 21 మంది క్షతగాత్రులు గాఆసుపత్రిలో వివిధ ఆసుపత్రి లలో చికిత్స పొందుతున్నారు.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులకు క్లూస్ టీమ్‌ను కూడా రంగంలోకి దింపి ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనతో కుమ్మరవాండ్లపల్లి గ్రామం ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. మృతుల కుటుంబాలతో పాటు గాయపడ్డ బాధితుల కుటుంబాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మంటలు ఆర్పేందుకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి.మేలు చేసేందుకు వెళ్లి ప్రాణాలు కోల్పోవడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘటన స్థలాన్ని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎం. శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ స్వయంగా పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, గాయపడిన వారి చికిత్సపై వైద్యాధికారులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, “కుమ్మరవాండ్లపల్లిలో జరిగిన ఈ విషాద ఘటన ఎంతో బాధాకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ప్రమాదానికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టము. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు అన్ని విధాల సహాయం అందిస్తాం” అని హామీ ఇచ్చారు.

కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఈ ఘటన జెలటిన్ స్టిక్స్ వంటి పేలుడు పదార్థాల వల్లే జరిగిందా? లేక మరేదైనా కారణమా? అనే కోణంలో విచారణ జరుగుతుందని త్వరలో సంఘటనకు గల కారణాలు వెలుగుచూస్తాయని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామంలో “వెంకన్న అనే వ్యక్తి గత పది సంవత్సరాలుగా బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంది. క్లూస్ టీమ్‌తో కలిసి పూర్తి స్థాయి దర్యాప్తు చేపడుతున్నాం. దోషులను గుర్తించి కఠినంగా శిక్షిస్తాం” అని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా. అక్రమంగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచడం, భద్రతా నిబంధనలు పాటించకపోవడం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించారు. సమగ్ర విచారణ అనంతరం అసలు కారణాలు వెలుగులోకి వచ్చాక బాధ్యులపై కఠినచర్యలు ఉంటాయి అని అధికారులు హెచ్చరించారు.

# లక్ష రూపాయలు విరాళం అందించిన హెచ్ కె ఆర్

**అమరాపురం ఏప్రిల్ 15 సీమవార్త**

మండల పరిధిలోని కె. శివరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో భక్తి, విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న లక్కమ్మదేవి అమ్మవారి దేవాలయ నిర్మాణానికి వైకాపా పార్టీ రాష్ట్ర బీసీ విభాగపు ఉపాధ్యక్షులు హాలుకూరు కాంతరాజు ఆలయ కమిటీ సభ్యులకు లక్ష రూపాయలు విరాళాన్ని అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులు మరియు ఎస్సీ కాలనీ ప్రజలు అడిగిన తక్షణమే లక్ష రూపాయలు విరాళం అందించిన హాలుకూరు కాంతరాజుకు దేవాలయ ప్రాంగణంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా డప్పు వైద్యాలతో పాటు బాణ సంచలు పేల్చిపండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న హాలుకూరు కాంతరాజు ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలుస్తూ మంచి నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారని నాయకులు అభినందించారు. దేవాలయ నిర్మాణానికి ఇచ్చిన ఈ విరాళం ఆయన సేవా మనోభావానికి, గొప్ప మనసుకు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్ త్రిలోక్ నాథ్, నియోజకవర్గ యస్ సి సెల్ అధ్యక్షులు ఉప్పార్లపల్లి శివన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, స్థానిక నాయకులు అంబరిష్ బాబు, యువ నాయకుడు పేలుబండ మల్లికార్జున, రంగనాథ్, మాజీ సర్పంచ్ ప్రసాద్, నాయకులు ఆటో హాలుకూరు రామ్మూర్తి ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ ఫలితాల్లో శ్రీ విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

**ఓబులదేవరచెరువు (ఏప్రిల్16)సీమవార్త:** స్థానిక శ్రీ విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. కే.మహితా శ్రీ మొదటి సంవత్సరం ఎంపీసీ459/460,కేటి మహి మన్విత మొదటి సంవత్సరం ఎంపీసీ 442/455,చరణ్ తేజ రెండవ సంవత్సరం ఎంపీసీ 954/1000,షేక్ మున్వర్జాన్ మొదటి సంవత్సరం ఎంపీసీ 460/470 మార్కులు సాధించి మండలంలోననే టాపర్లుగా నిలిచినట్లు శ్రీ విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ మస్తాన్ తెలిపారు. సదరు కళాశాల విద్యార్థులు మండలంలోనే ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలవడం పట్ల కరస్పాండెంట్ తో పాటు ప్రిన్సిపల్ నవీన తో పాటు ఇతర ఉపా - ధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కరస్పాండెంట్ మస్తాన్ మాట్లాడుతూ.... శ్రీ విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మండలంలోని టాపర్లుగా నిలిచి కళాశాలకు గొప్ప పేరు తెచ్చారన్నారు. భవిష్యత్తులో విద్యార్థులను మరింత మెరుగు దిద్ది మరింత ఆశాజనకంగా ఫలితాలు సాధిస్తామన్నారు. మా కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించడంలో కళాశాల బృందం, తల్లిదండ్రుల తోడ్పాటు, విద్యార్థులకు కృషి ఎంతో ఉందన్నారు. అలాగే బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు.






# కుమ్మరవాళ్లపల్లి ఘటన బాధాకరం.

- ....కుమ్మరవాళ్లపల్లి అగ్నిప్రమాదం దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆవేదన
- ....గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం
....బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుంది
....ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు -- మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనలు

**ధర్మవరం రూరల్ ఏప్రిల్ 15 సీమవార్త :--**

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాళ్లపల్లిలో చోటుచేసుకున్న అగ్నిప్రమాద ఘటన రాష్ట్రాన్ని తీవ్ర విషాదంలో ముంచేసిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అగ్నిప్రమాదంలో గాయపడిన బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒకరికి, అలాగే కదిరి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 26 మంది క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యం అందించాలని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. బాధితుల ప్రాణరక్షణకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలను సమకూర్చాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని మంత్రి ఆదేశించారు. అవసరమైతే మరింత మెరుగైన చికిత్స కోసం ఉన్నత ఆసుపత్రులకు తరలించేందుకు కూడా సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ దుర్ఘటనలో బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్ట సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. బాధితులకు అవసరమైన సహాయం, పునరావాసం మరియు ఇతర అన్ని విధాల సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సంఘటనపై సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజలు కూడా అగ్నిప్రమాదాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



# రెండవసారి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుండుమల తిప్పేస్వామి

- సంబరాల్లో తెలుగు తమ్ముళ్లు, గుండుమల అభిమానుల

**మడకశిర ఏప్రిల్ 15 సీమ వార్త**

పట్టణం లోని అమరాపురం బస్టాండ్, జ్యోతిరావు పూలే సర్కిల్ నందు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రెండవసారి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కి అవకాశం కల్పించినందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు గుండుమల తిప్పేస్వామి అభిమానులు బాణా సంచాలు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టడం జరిగింది, తర్వాత జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేయడం జరిగింది, గుండుమల తిప్పేస్వామి కి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మరొక్కసారి అవకాశం కల్పించినందుకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కి, టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు కి, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ కి , జిల్లా ఇన్చార్జ్ మంత్రులు అనగాని సత్యప్రసాద్ కి, జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు కి తెలుగుదేశం పార్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, రాష్ట్ర మైనార్టీ డైరెక్టర్ భక్తర్ సాబ్, కన్వీనర్ నాగరాజు, కో క్లస్టర్ గుండుమల మాజీ సర్పంచ్ చంద్రప్ప, సింగల్ విండో అధ్యక్షుడు కన్నా ,మాజీ తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్లు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి తిమ్మరాజు, క్లస్టర్ ఇంచార్జ రంగే గౌడ్, మున్సిపల్ కాంట్రాక్టర్ అక్కంపల్లి బాబు యూనిట్ బూత్ ఇన్చార్జులు, శంకర రమేష్ ఈశ్వర్ మంజు రవి ప్రకాష్ మారుతి సురేష్ మరియు అన్ని అనుబంధ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



## జనగణన సర్వే కార్యక్రమం ద్వారా
## ఎనిమినేటర్స్ , సూపర్వైజర్లు శిక్షణ కార్యక్రమం.......

**నంబులపూలకుంట: ఏప్రిల్ 15 (సీమవార్త):** జనగణన సర్వే లో ఇంటింటికుటుంబ వివరాలను పక్కాగా నమోదు చేయాలని తాహసిల్దార్ దేవేందర్ నాయక్, ఎంపీడీవో పార్థసారథి లు జనగణ న శిక్షణ కార్యక్రమం మూడు రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించబడును. సూపర్వైజర్లకు, అనిమినేటర్స్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా అధికారుల శిక్షణలో మాట్లాడుతూ మండలంలో జనగణ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జనగణ న సర్వేకి కేటాయించిన సిబ్బంది గనుకులకు, ఇంటింటి గణన విధానం, డేటా సేకరణ పద్ధతులు, డిజిటల్ అప్లికేషన్ వినియోగం, కుటుంబ వివరాల నమోదు, ప్రభుత్వ మార్గదర్శకాలు గూర్చి శిక్షణలో అధికారులు తెలియజేశారు. ఈ సర్వే కార్యక్రమంలో ఎలాంటి తప్పిదాలు లేకుండా పక్కాగా చేయాలని పలు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.



## ఇంటర్ లో వందశాతం
## ఉత్తీర్ణత సాధించిన కేజీబీవీ విద్యార్థినులు






**అమరాపురం ఏప్రిల్ 15 సీమవార్త**



మండల కేంద్రంలోని ప్రభుత్వ కేజీబీవీ కళాశాల సిఇసి గ్రూప్ విద్యార్థినులు మొదటి ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ అనిత,జానకి లు తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్ లో 28 మందికి 28 మంది ఉత్తీర్ణత సాధించినట్లు, హెచ్ రంజిత 500 మార్కులకు గాను 486 మార్కులు, వి అశ్విని 500 మార్కులకు గాను 475 మార్కులు సాధించినట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ నందు ఈ మౌనిక 1000 మార్కులకు గాను 959 మార్కులు, టి చిన్మయ 1000 మార్కులకు గాను 949 మార్కులు సాధించి ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేజీబీవీ కళాశాల అధ్యాపక బృందం వందశాతం సాధించిన విద్యార్థినులను అభినందించారు. మంచి ఫలితాలు సాధించడానికి కష్టపడిన అధ్యాపక బృందాన్ని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిత అభినందించారు.

## ఎంపీడీవో అంజినప్ప
## చేతుల మీదుగా... చలివేంద్రం ప్రారంభం.



**నల్లమాడ ఏప్రిల్ 15 సీమ వార్త.**

నల్లమాడ మండల కేంద్రమైన సచివాలయం ఒకటి వద్ద ఎంపీడీవో దేశం గానీ అంజనప్ప గారు చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దేశం గారి అంజనప్ప మాట్లాడుతూ వేసవి కాలం ప్రజల దాహం తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని , ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వృద్ధులు మరియు పిల్లలు ఉదయము 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఇంటి వద్ద రెస్టు తీసుకోవాలని, చల్లని పానీయాలు చల్లని మజ్జిగ, ఓ ఆర్ ఎస్ ద్రవం, కొబ్బరినీళు వంటి చల్లని పానీయాలు తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదని, ఎండాకాలం వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వారు తెలిపారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఎంపీడీవో దేశం గారి అంజన్నప్ప గారు, ఏపీఎం గోపాల్, మైలే శంకర, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, డైరెక్టర్ నాగే నాయక్, ఎక్స్ డైరెక్టర్ ఎన్ నరసింహులు, ఎమ్మెస్ వై వనజ, మంజూ రెడ్డి, డీలర్ వై రమేష్ రెడ్డి, కిరణ్ కుమార్, నారాయణ నాయక్ , ఏపీవో రఘునాథరెడ్డి,సచివాలయ సిబ్బంది దాదాసాబ్, దస్తగిరి, నారాయణస్వామి, టెక్నికల్ నాగేంద్ర, బాలమురళి,పారిశుద్ధ కార్మికులు నరసింహులు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

## ఇంటర్ ఫలితాలలో అద్భుత
## ఫలితాలు సాధించిన కేజీబీవీ కళాశాల విద్యార్థులు

**లేపాక్షి సీమ వార్త ఏప్రిల్15:**

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సర ఫలితాలలో లేపాక్షి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థినులు అద్భుత ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరంలో 39 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 36 మంది 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు 36 మంది పరీక్షలు రాయగా 30 మంది విద్యార్థులు పాసై 83 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొ న్నారు. మొదటి సంవత్సరం బైపీసీలో కే దివ్య బాయి 442/500 మార్కులు, కే సుభాషిని బాయి 433, నందిని 427, ద్వితీయ సంవత్సర బైపీసీ నందు గీతాంజలి 950/1000, తస్లీమ్ 926, దివ్య 917 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. మొదటి సంవత్సరం 400 పైగా మార్కులు సాధించిన వారిలో 15 మంది విద్యార్థినిలు ఉండగా, 350 పైగా 8 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం లో 900కు పైన నలుగురు విద్యార్థులు, 870కు పైన 11 మంది విద్యార్థులు మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే ఆరవ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం ఆన్లైన్ అడ్మిషన్లు ఏప్రిల్ 20వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి ప్రిన్సిపాల్ కోరారు.

## పిన్నదరి లో వనభోజనాలు

**తాడిమర్రి. ఏప్రిల్ 15 సీమ వార్త**



పిన్న ధరిగ్రామంలో అంగరంగ వైభవంగా వనభోజనాలా మహోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

బుధవారం ఉదయం ఏడు గంటలకు గ్రామము అంతా ఖాళీ చేసి రామస్వామిని అతకల్లప్ప స్వామిని ఊరిబయటకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు రామాయణ పురాణములు శ్రీ వెంకటేశ్వర శర్మ స్వామి ఆధ్వర్యంలో ప్రజలకు వినిపించారు గ్రామస్తులందరూ బంధువులతో సరదాగా ఆనందంగా వనభోజనం మహోత్సవం గడిపారు. శ్రీరామనమి పండగ తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో వనభోజన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది ఈ కార్యక్రమం అంతా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగినది, గురు వారం పారువేట కార్యక్రమంఉందన్నారు